సాక్షి రంగారెడ్డి

శనివారం ၊ 13 ၊ జూలై ၊ 2024



రథయాత్రను ప్రారంభిస్తున్న సీఐ ప్రమోద్‌కుమార్, నిర్వాహకులు



కాషాయ జెండాతో విదేశీ భక్తురాలు

న్యూస్‌రీల్

సీఎం సభా స్థలి ఏర్పాట్ల పరిశీలన



లష్కర్‌గూడలో స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని లష్కర్ గూడలో ఆదివారం నిర్వహించనున్న సీఎం సభ స్థలాన్ని కలెక్టర్ శశాంకతో కలిసి ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. కల్లు గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రభుత్వం తరఫున అందించే 'కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ కిట్స్) పంపిణీ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సభా స్థలితో పాటు ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి వారు పరిశీలించారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి



ట్రీ పార్కు వద్ద వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్

మహేశ్వరం: వన మహోత్సవంలో నాటిన మొక్కలను సంరక్షించాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీలోని ఒకటో వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో ఇటీవల వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వన మహోత్సవం కార్యక్రమం కింద నాటిన మొక్కలకు ట్రీగార్డులు, కట్టెలు కట్టి.. సమయానికి నీరందిస్తూ సంరక్షించాలని సూచించారు. మున్సిపల్‌కి విధించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయని, వ్యాధులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల మధ్య చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అంతకు ముందు వన మహోత్సవంలో నాటిన మొక్కలు, ట్రీ పార్కు, నర్సరీలు, పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, మేనేజర్ టి.పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్లు మల్లేష్, జంగయ్య, ఏఈ భార్గవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రథయాత్రలో కోలాటమాడుతూ ఉత్సాహంగా పాల్గొన్న భక్తులు

• శోభాయమానం

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో నిర్వహించిన పూరీ జగన్నాదుని రథయాత్ర శోభాయమానంగా జరిగింది. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. స్థానిక జాతీయ రహదారిపై అయ్యప్ప కొండ వద్ద రథయాత్రను సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, పాపిశెట్టి రాము ప్రారంభించారు. ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షుడు మహర్షింగ్ ప్రభు, ఆర్ట్ ఆఫ్ రిలాగ్జేషన్ ట్రస్టు చైర్మన్ విజయ్ ప్రతాప్ మహారాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అయ్యప్ప కొండ వద్ద ప్రారంభమైన రథయాత్ర ప్రభుత్వాస్పత్రి, బస్టాండ్, మార్కండేయ దేవాలయం నుంచి కన్యకాపరమేశ్వరి దేవాలయానికి చేరుకుంది. కన్యకా పరమేశ్వరీ ఆలయంలోని మండపంలో దేవతామూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు రథయాత్రలో పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. మహిళల కోలాటాలు, భజనలు కళాకారుల డప్పు ప్రదర్శనలతో సందడి వాతావరణం నెలకొంది. రథయాత్రలో విదేశీ భక్తుల కీర్తనలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిర్వాహకులు పాపిశెట్టి రాము, వెంకటయ్య, వీరబొమ్మ రామ్మోహన్, ఎంగలి బాలకృష్ణ, శ్రీశైలం, కృష్ణయ్య, మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ జెడ్పీటీసీలు అనురాధ పత్యానాయక్, దశరథ్‌నాయక్, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



విదేశీయుల సందడి

చెయ్యెత్తి.. జైకొట్టి!



- వరుసగా కారు దిగుతున్న బీఆర్‌ఎస్ శాసనసభ్యులు
- మొన్న కాలె యాదయ్య.. నిన్న ప్రకాష్.. తాజాగా 'గాంధీ'
- అసెంబ్లీ సమావేశాల నాటికి గ్రేటర్ గులాబీ ఖాళీ?



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

సాక్షి, రంగారెడ్డి జిల్లా: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీకి షాక్‌ల మీద షాక్ ఇస్తున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఘోరపరాజయం పాలైన ఆ పార్టీని ఒక్కొక్కరుగా వీడుతున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే ఖైరతాబాద్‌ఎమ్మెల్యే దానం నాగేందర్ కారు దిగి హస్తం గూటికి చేరగా.. ఆ తర్వాత మేయర్ విజయలక్ష్మి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పార్టీని వీడారు. తాజాగా శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కూడా శనివారం బీఆర్‌ఎస్‌ను వీడనున్నారు. ఇలా ఒకరి తర్వాత మరొకరు కారు దిగి హస్తం గూటికి చేరుకుంటూ గులాబీ పార్టీ అధిష్టానానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగి.. ఎమ్మెల్యేలను బుజ్జగించే ప్రయత్నం చేసినా.. వలసలు మాత్రం ఆగకపోవడం ఆ పార్టీని ఆందోళనకు గురి చేస్తోంది. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నాటికి గ్రేటర్ పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా పార్టీని వీడే అవకాశం ఉందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎమ్మెల్సీ నవీన్‌రావు సహా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద సహా మరికొంత మంది బీఆర్‌ఎస్ నేతలు పార్టీ మారనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలే వీరంతా రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబును, ఏపీ సీఎం చంద్రబాబును కలిశారు. అనంతరం గచ్చిబౌలిలోని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. వీరి చేరికల తర్వాత బీఆర్‌ఎస్ ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం చేసే అవకాశం ఉంది. ఇదే జరిగితే పదేళ్ల పాటు గ్రేటర్‌లో హవా కొనసాగించిన బీఆర్‌ఎస్.. త్వరలోనే పూర్తిగా కనుమరుగు కావడం ఖాయంగా కనిపిస్తోంది.

గాంధీతో పాటు మరికొందరు..

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముహూర్తం ఖరారైంది. శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. ఆయనతో పాటు చందానగర్, మియాపూర్,హైదర్‌నగర్, వివేకానందనగర్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు.పార్టీ మారుతున్నట్లుగా గాంధీ ఆయన ముఖ్య కార్పొరేటర్లు, డివిజన్ స్థాయి అనుచరులకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరికపై గాంధీ బిజీబిజీగా ఉన్నారు.కాగా శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాద వ్, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కాంగ్రెస్‌లో చేరేందుకు విముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.

బుద్ధా .. ఎవరికీ పట్టదా..



బొంగ్లూర్ ఔటర్ జంక్షన్ వద్ద దారిన వెళ్లే వారిని ఆకట్టుకునేలా బుద్ధిడి ప్రతిమను ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ మరిచిపోయారు. చేతులు కిందికి పడిపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. కలెక్టరేట్‌కు అధికారులు నిత్యం ఈ దారి నుంచే వెళ్తుంటారు.

రండి.. తాజా కూరలండి



కలెక్టరేట్ ఆవరణలో చుట్టుపక్కల గ్రామాల రైతులు పండించిన తాజా కూరగాయాలను తెచ్చి విక్రయిస్తున్నారు. కలెక్టరేట్‌లో పనిచేసే అధికారులు, సిబ్బందితోపాటు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు వాటిని కొనుగోలు చేస్తున్నారు.

గలీజు దందాలు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఫాంహౌస్‌లు

- అద్దెకు తీసుకుని వక్ర మార్గంలో నడుపుతున్న నిర్వాహకులు
- సరదాల మాటున పెడదారి పడుతున్న యువత
- మామూళ్ల మత్తులో పట్టించుకోని పోలీసులు!



మొయినాబాద్ మండలం నజీబ్‌నగర్ రెవెన్యూలో ముజ్రా పార్టీ నిర్వహించిన ఫాంహౌస్

మొయినాబాద్: వీకెండ్‌లో సరదాలకోసం నిర్మించుకుంటున్న ఫాంహౌస్‌లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. సరదా పార్టీలు, మందు పార్టీలు, రేవ్ పార్టీలు, ముజ్రా పార్టీలతోపాటు వ్యభిచారం సైతం నడుస్తున్నాయి. అప్పుడప్పుడు పోలీసులు దాడిచేసి గుట్టు రట్టు చేస్తున్నా ఈ దందాలకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. నగర శివారుల్లోని ఫాంహౌస్‌లలో నిత్యం జరుగుతున్న ఈ తంతుకు ఆకర్షితులై యువత పెడదారి పడుతోంది. మహా నగరానికి చేరువగా ఉండడంతో మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, శంషాబాద్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో చాలామంది ఫాంహౌస్‌లు నిర్మించుకుంటున్నారు. ఒక్క మొయినాబాద్ మండలంలోనే సుమారు వెయ్యికి పైగా ఫాంహౌస్‌లున్నాయి. చాలా మంది 10 గుంటల నుంచి ఎకరం వరకు కొనుగోలు చేసి అందులో ఫాంహౌస్ నిర్మిస్తున్నారు. వీకెండ్స్‌లో పిల్లలతో వచ్చి ఆనందంగా గడపడానికంటూ నిర్మించి తర్వాత వాటిని ఇతరులకు లీజుకు, అద్దెకిస్తున్నారు.

నిర్వాహకుల అడ్డగోలు దందాలు..

ఫాంహౌస్‌లను అద్దెకు తీసుకుంటున్న నిర్వాహకులు వాటిలో అడ్డగోలు దందాలు చేస్తున్నారు. గెట్‌టుగెదర్ పార్టీలు, ఫ్యామిలీ పార్టీలు, బర్త్‌డేలు అంటూ రోజువారీగా అద్దెకిస్తున్నారు. వీటితోపాటు రేవ్ పార్టీలు, ముజ్రా పార్టీలు నిర్వహిస్తున్నారు. ఫాంహౌస్‌లకు వచ్చే యువకులను ఆకర్షించే విధంగా ఇతర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకొచ్చి వ్యభిచారం సైతం చేయిస్తున్నారు. మొయినాబాద్ మండలంలోని కనకమామిడి, చాకలిగూడ, సురంగల్, నజీబ్‌నగర్, శ్రీరాంనగర్, తోలుకట్ట, ఎత్‌బార్‌పల్లి, నక్కలపల్లి, అప్పారెడ్డిగూడ, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, రెడ్డిపల్లి, ఎనికేపల్లి, అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, బాకారం, అమ్డాపూర్ గ్రామాల పరిధిలో ఉన్న ఫాంహౌస్‌ల్లో ఈ దందాలు జోరుగా కొనసాగుతున్నాయి. కనకమామిడిలోని ఓ ఫాంహౌస్‌లో వ్యభిచారం, ముజ్రా పార్టీలు నిత్యం నిర్వహిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులే ఆ ఫాంహౌస్ వైపు వెళ్లొద్దంటూ పోలీసులకు సూచించినట్లు తెలుస్తోంది. ఫాంహౌస్‌లలో అక్రమంగా మద్యం తాగడం, హుక్కా, గంజాయి, డ్రగ్స్ వినియోగం యథేచ్ఛగా సాగుతున్నాయి. కొన్ని ఫాంహౌస్‌ల్లో పేకాట సైతం జోరుగా నడుస్తోంది.

కొరవడిన పోలీసుల నిఘా

ఫాంహౌస్‌లపై నిఘా పెట్టాల్సిన పోలీసులు నిర్వాహకులతో మిలాకత్ అవుతున్నట్లు సమాచారం. వారి నుంచి నెలనెలా మామూళ్ల దండుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అందుకే రాత్రి పూట ఎంత హంగామా జరిగినా పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు ఎస్ఓటీ పోలీసులు దాడులు చేసి ముజ్రా, రేవ్ పార్టీలు, వ్యభిచారం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలను భగ్నం చేస్తున్నారు. స్థానిక పోలీసులు మాత్రం దాడులు చేసిన దాఖలాలు లేవు.

వెలుగుచూసిన ఘటనలు

- పది నెలల క్రితం కనకమామిడి రెవెన్యూలోని ఓ ఫాంహౌస్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు నిర్వాహకులు, ఇద్దరు వ్యక్తులు, ఇద్దరు మహిళలను ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు.
- ఆరు నెలల క్రితం కనకమామిడి రెవెన్యూ పరిధిలోని ఓ ఫాంహౌస్‌పై ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు నిర్వాహకులు, నలుగురు విటులు, ముగ్గురు మహిళలను పట్టుకున్నారు.
- తాజాగా సోమవారం అర్ధరాత్రి నజీబ్‌నగర్ రెవెన్యూలోని ఫాంహౌస్‌పై ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి ముజ్రా పార్టీని భగ్నం చేశారు. ఆరుగురు యువకులు, నలుగురు యువతులను పట్టుకున్నారు.

నోటీసులు ఇస్తున్నాం



ఫాంహౌస్‌లన్నింటికీ నోటీసులు ఇస్తున్నాం. అద్దెకు ఇస్తే ఏ పార్టీ నిర్వహించేందుకు ఇచ్చారో మాకు సమాచారం ఇవ్వాలని యజమానులు, నిర్వాహకులకు చెబుతున్నాం. సమాచారం ఇవ్వనివారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. ఫాంహౌస్‌లపై నిఘా పెంచుతాం.

– పవన్‌కుమార్‌రెడ్డి, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్

మైసిగండి మైసమ్మ ఆలయానికి భారీగా ఆదాయం

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మదేవత, శివాలయ, రామాలయాల ప్రాంగణంలో 2024–25 సంవత్సరానికి గాను కొబ్బరికాయల విక్రయం, వాహన పూజ రసీదు రుసుం వసూలు హక్కులకు సంబంధించి శుక్రవారం వేలం పాట నిర్వహించారు. దేవాదాయ శాఖ జిల్లా కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలీ, ఈవో స్నేహలత సమక్షంలో మైసమ్మ ఆలయ ప్రాంగణంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా మైసిగండి మైసమ్మదేవత, శివాలయ, రామాలయాల ప్రాంగణంలో కొబ్బరికాయల విక్రయ హక్కుకు వేలం పాట నిర్వహించగా ముగ్గురు పాల్గొన్నారు. వేలంలో హెచ్చు పాట పాడి రూ.39.12 లక్షలకు మైసిగండి గ్రామానికి చెందిన రామవత్ అమృనాయక్ కొబ్బరికాయల విక్రయ హక్కును కై వసం చేసుకున్నాడు. అనంతరం వాహన పూజ రసీదు రుసుం వసూలు చేసుకునే హక్కుకు వేలం పాట నిర్వహించగా ముగ్గురు పాల్గొన్నారు. అత్యధికంగా రూ.13.11లక్షలకు వేలం పాడి మైసిగండికి చెందిన కేతావత్ శివరాం హక్కును సొంతం చేసుకున్నాడు.

తటాకం.. ఆకాశం.. ప్రకృతి చిత్రం



తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు వద్ద శుక్రవారం సాయంత్రం మేఘాలు ఇలా కమ్ముకుని ఆహ్లాదకర వాతావరణం ఆవిష్కృతమైంది.

పెట్రోలింగ్‌కు 'సై'కిళ్లు



ప్రభుత్వం అందజేసిన సైకిళ్లపై శుక్రవారం ఇబ్రహీంపట్నం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సాధారణ జనాలతో కలిసిపోయి, తిరిగేందుకు సైకిళ్లు ఎంతగానో ఉపయోగపడుతాయని చెబుతున్నారు. ఓ ఎస్ఐ, కానిస్టేబుల్, మరో లేడీ కానిస్టేబుల్ శుక్రవారం సైకిళ్లపై తిరుగుతూ వీధుల్లో చక్కర్లు కొట్టారు. ఎప్పుడూ సైరన్లు వేసుకుని ఇన్నోవాలు, జీపులు, బైక్‌లపై తిరిగే వీరిని చూసి ప్రజలు కొంత విస్మయానికి గురయ్యారు. అర్బన్ ఏరియాల్లో పోలీసులు సాధారణ వ్యక్తుల మాదిరిగా సైకిళ్లపై తిరుగుతూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారని ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు.

– ఇబ్రహీంపట్నం

ఆసరా పింఛన్ల పెంపునకు పోరాడండి


ఎమ్మెల్యేకి వినతిపత్రం అందిస్తున్న జంగయ్య

కందుకూరు: ఆసరా పింఛన్లను పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వీహెచ్‌పీఎస్(వికలాంగుల హక్కుల పోరాట సమితి) రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య శుక్రవారం ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందించారు. ఎన్నికల ముందు ఆసరా పింఛన్లను పెంచుతామని కాంగ్రెస్ ప్రకటించిందని, ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా పెంపు ఊసేలేదని ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పక్షాన నిలబడి పోరాడాలని కోరారు.

కన్న కొడుకే సూత్రధారి?

- తండ్రిని చంపేందుకు బాడీగార్డుకు సుపారీ
- కేకే హత్య కేసులో పోలీసుల దర్యాప్తు ముమ్మరం

షాద్‌నగర్‌రూరల్: జిల్లాలో సంచలనం సృష్టించిన కమ్మరి కృష్ణ అలియాస్ కేకే హత్య కేసులో ఆసక్తికర విషయాలు వెలుగు చూస్తున్నాయి. పెద్ద భార్య కుమారుడే కృష్ణను హత్య చేసినట్లు విశ్వసనీయ సమాచారం. షాద్‌నగర్ పరిధిలోని కమ్మదనం గ్రామ శివారులోని ఫాంహౌస్‌లో హత్యకు గురైన కృష్ణ కేసు మిస్టరీని ఛేదించేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

పక్కా ప్లాన్‌తో

ఆస్తి తగాదాల నేపథ్యంలో కృష్ణ పెద్ద భార్య కొడుకు హత్యలో ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు తెలుస్తోంది. కృష్ణకు బాడీగార్డుగా ఉన్న బాబా అలియాస్ శివానంద్‌తో పెద్ద భార్య కొడుకు చేతులు కలిపినట్లు సమాచారం. తండ్రిని హతమార్చేందుకు బాబాకు భారీ మొత్తంలో సుపారీ ఇచ్చినట్లు తెలుస్తోంది. పక్కా ప్లాన్ ప్రకారం తండ్రిని హతమార్చేందుకు కొన్ని రోజులుగా కొడుకు కుట్ర పన్నినట్లు సమాచారం. కృష్ణ సంపాదించిన ఆస్తి మూడో భార్యకు చెందుతుందనే ఉద్దేశంతో పెద్ద భార్య కొడుకు తండ్రిని హత్య చేయించినట్లు విశ్వసనీయ సమాచారం. బాబా తన మిత్రులైన సందీప్, జగదీశ్‌లతో కలిసి కమ్మదనం ఫాంహౌస్‌లో కృష్ణను హత్య చేసి అక్కడి నుంచి పరారై శంషాబాద్‌లో పోలీసులకు లొంగిపోయారు.

కుమారుడి హత్యకు కుట్ర

కొంత కాలంగా కృష్ణకు తన పెద్ద భార్య కొడుకులతో తగాదాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితం తనకు బాడీగార్డుగా ఉన్న బాబాతోనే కొడుకును హత్య చేయించేందుకు కృష్ణ ప్లాన్ వేయగా రెండుసార్లు తప్పించుకున్నట్లు సమాచారం. ఆస్తులు కావాలని కొడుకు తరచూ తండ్రితో గొడవలు పడుతున్న దశలో ప్లాన్ వేశాడు.

ప్రాణం తీసిన నిర్లక్ష్యం

- డీసీఎం డ్రైవర్ అజాగ్రత్తతో మూడు వాహనాలు ఢీ
- ఒకరి దుర్మరణం, ఇద్దరికి తీవ్ర గాయాలు
- కొత్తూరు వై జంక్షన్‌లో దుర్ఘటన


గాయపడిన దినేష్‌గౌడ్


అంజయ్య (ఫైల్)


ప్రమాద తీరును పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

కొత్తూరు: పని ప్రదేశం నుంచి ఇంటికి వెళ్తున్న ఓ వ్యక్తిని రోడ్డు ప్రమాదం పొట్టన పెట్టుకుంది. డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం గాల్లో కలువగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రహదారిపై మూడు వాహనాలు సినిమాల్లో మాదిరిగా ఢీకొన్న తీరు స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలోని వై జంక్షన్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాత జాతీయ రహదారి గుండా వచ్చిన ఓ డీసీఎం వై జంక్షన్ కూడలిలో మలుపు తిప్పుతుండగా షాద్‌నగర్ నుంచి శంషాబాద్‌కు వెళ్తున్న కంటెయినర్‌ను ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు అదుపుతప్పి కొత్తూరు నుంచి షాద్‌నగర్‌కు వెళ్లే రోడ్డుపైకి దూసుకెళ్లాయి. ఇదే క్రమంలో షాద్‌నగర్ నుంచి పత్తిబేళ్లతో వస్తున్న లారీని కంటెయినర్ ఢీ కొట్టడంతో బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న పత్తి బేళ్లు అదే రూట్లో వెనకాల స్కూటీపై వస్తున్న ఇద్దరు వ్యక్తులపై పడ్డాయి. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న మండలంలోని పెంజర్లకు చెందిన అంజయ్య(54) అక్కడికక్కడే మృతి చెందారు. వెనకాల కూర్చున్న తిమ్మాపూర్‌కు చెందిన దినేష్(27)కు తీవ్ర గాయాలయ్యాయి. అంతే కాకుండా కంటెయినర్ డ్రైవర్ ప్రహ్లాద్ క్యాబిన్‌లోనే ఇరుక్కు పోయాడు. పోలీసులు, స్థానికులు తీవ్రంగా శ్రమించి జేసీబీతో అడ్డంకులు తొలగించి అతడిని బయటకు తీశారు.

ఇంటికి వెళ్తూ.. మృత్యు ఒడిలోకి

ఘటన జరిగిన ప్రదేశానికి వంద మీటర్ల దూరంలో ఉన్న ఐటీసీఎల్ ప్లాంట్‌లో అంజయ్య లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ప్రమాదానికి అర్ధగంట ముందే లారీని అక్కడ పార్క్ చేసి స్కూటీపై పెంజర్లలో ఉన్న ఇంటికి బయలు దేరారు. ఈ క్రమంలో తిమ్మాపూర్‌కు చెందిన దినేష్ లిఫ్ట్ అడిగి స్కూటీపై వస్తున్నారు. వారు వై జంక్షన్‌లోకి రాగానే మూడు వాహనాలు ఢీకొని ప్రమాదానికి గురయ్యారు. ఇందులో అంజయ్య మృతి చెందగా లిఫ్ట్ అడిగిన దినేష్ తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటనాస్థలాన్ని శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంతో కూడలిలో అరగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. క్రేన్ల సాయంతో వాహనాలను పక్కకి తప్పించి పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

వ్యక్తి మృతికి కారకుడైన డ్రైవర్‌కు మూడేళ్ల జైలు

యాచారం: నిర్లక్ష్యంగా కారును నడిపి ఓ వ్యక్తి మృతికి కారకుడైన డ్రైవర్‌కు శుక్రవారం ఇబ్రహీంపట్నం కోర్టు మూడేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.1,500 జరిమానా విధించింది. యాచారం సీఐ శంకర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. నల్లగొండ జిల్లా అనుముల మండలం శాంతినగర్‌కు చెందిన రాంచంద్రయ్య 2018లో నగరం నుంచి మాల్‌కు కారులో వెళ్తున్నాడు. నగరంలోని మీర్‌పేటకు చెందిన గోవింద్ నారయ్య, గోవింద్ వినయ్ మోటార్ సైకిల్‌పై మాడ్గుల్‌కు వెళ్లి తిరిగి మీర్‌పేటకు వస్తున్నారు. మార్గమధ్యలో మాల్ గ్రామానికి సమీపంలో కారులో వెళ్తున్న రాంచంద్రయ్య ఎదురుగా బైక్‌పై వస్తున్న నారయ్య, వినయ్‌లను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నారయ్య తీవ్ర గాయాలైన మృతి చెందగా, వినయ్ గాయాలతో బయటపడ్డాడు. ఇదే విషయమై పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి వివరాలతో ఇబ్రహీంపట్నం కోర్టులో సమర్పించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం శుక్రవారం రామచంద్రయ్యకు మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.1,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి


జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

చేవెళ్ల: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి ఆరోపించారు. శుక్రవారం మండలంలోని దేవుని ఎర్రవల్లిలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్లు ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


ఆవు కళేబరం

కొందుర్గు: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సుధాకర్‌గౌడ్‌కు సంబంధించిన ఆవు శుక్రవారం మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నారు. అతనిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

కోలుకుంటున్న విద్యుత్ ప్రమాద బాధితులు


చికిత్స పొందుతున్న యువకుడు

పహాడీషరీఫ్: స్విమ్మింగ్ పూల్‌లో విద్యుత్ ప్రమాదం జరిగిన సంఘటనలో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పహాడీషరీఫ్ పోలీసులు తెలిపారు. పాతబస్తీకి చెందిన ఓ కుటుంబం గురువారం జల్‌పల్లి మరాఠ భవన్ వెనకాల ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టేందుకు వెళ్లారు. అక్కడ స్విమ్మింగ్ పూల్‌కు ఆనుకొని ఉన్న ఈత చెట్టు కొమ్మలు ఈదురు, గాలుల వల్ల హై టెన్షన్ వైర్‌కు తాకాయి. దీంతో చెలరేగిన నిప్పు రవ్వలతో హై టెన్షన్ వైర్ తెగి స్విమ్మింగ్ పూల్‌లోని నీళ్లల్లో పడి విద్యుదాఘాతం సంభవించింది. దాదాపు 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరికి మాత్రం కాలిన గాయాలు ఎక్కువగా ఉండడంతో కుటుంబ సభ్యులు వారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారి పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్ దారుణ హత్య

సనత్‌నగర్: సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫతేనగర్–వాల్మీకినగర్ సమీపంలో ఓ ట్రాన్స్‌జెండర్ హత్యకు గురయ్యాడు. బాలానగర్ ఏసీపీ హనుమంతరావు తెలిపిన వివరాల ప్రకారం వాల్మీకినగర్ సమీపంలో ఓ మృతదేహం ఉందంటూ డయల్ 100 ద్వారా బాలానగర్ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులు ఇచ్చిన సమాచారాన్ని బట్టి ఆ మృతదేహం ట్రాన్స్‌జెండర్ షీలా అలియాస్ షేక్ సాజిద్ అహ్మద్ అబ్బాస్ (30)గా గుర్తించారు. వరంగల్ జిల్లాకు చెందిన షీలా కొన్నేళ్లుగా బాలానగర్ హెచ్‌ఎంటీ సొసైటీలో నివాసం ఉంటున్నారు. షీలా చేతులపై గోళ్లతో రక్కిన గాయాలు, కాలికి కాలిన గాయాలు, తల నుంచి రక్తస్రావం జరిగినట్లుగా ఆనవాళ్లు కన్పించాయి. దీంతో తలపై కర్రతో గానీ, బండరాయితో గానీ కొట్టి హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. హత్య జరిగిన ప్రాంతానికి వెళ్లే రహదారుల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. కాగా ఈ కేసులో ఓ రౌడీషీటర్‌తో సహా నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇక ఈ హత్యకు నిరసనగా ట్రాన్స్‌జెండర్లు శుక్రవారం సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు.

కార్మికుల కోసం నిరంతర పోరాటం

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు


మాట్లాడుతున్న పానుగంటి పర్వతాలు

షాద్‌నగర్: కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పేర్కొన్నారు. పట్టణంలోని దేవి గ్రాండ్ హోటల్‌లో శుక్రవారం సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ.. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. షాద్‌నగర్ పారిశ్రామిక ప్రాంతంలో వందలాది పరిశ్రమలు ఉన్నాయని, నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయని అన్నారు. ఈ క్రమంలో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారనే విషయాన్ని గుర్తు చేశారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి కార్మికుల సంక్షేమం కోసం చొరవ తీసుకోవాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. పరిశ్రమల్లో యజమానులు నిర్లక్ష్యానికి కార్మికులు బలవుతున్నా చర్యలు తీసుకునే వారు కరువయ్యారన్నారు. మండలాల్లో ఏఐటీయూసీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు తగిన విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామస్వామి, వనంపల్లి జైపాల్‌రెడ్డి, చంద్రయాదవ్, నర్సింహారెడ్డి, శ్రీను నాయక్, షకీల్, చంద్రబాబు, శేఖర్‌రెడ్డి, పవన్ చౌహాన్, ఆకాష్ రాహుల్, సాయికుమార్, మంజుల, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు


రాజేశ్ (ఫైల్)

చేవెళ్ల: పాల ప్యాకెట్లు సప్లయ్ చేయడానికి బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దామరగిద్ద గ్రామానికి చెందిన చాకలి వీరయ్య కుమారుడు చాకలి రాజేశ్(17) సాయంత్రం పూట స్థానిక డెయిరీ వ్యాపారి దగ్గర పాల ప్యాకెట్లు సప్లయ్ చేసేవాడు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం గ్రామానికి చెందిన మిత్రులు వినయ్, అభిషేక్‌లతో కలిసి రాజేశ్ ఒకే బైక్‌పై సప్లయ్ చేయడానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో చేవెళ్లలోని మోడల్ కాలనీ వద్ద వీరి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనకాల కూర్చున్న రాజేశ్ ఎగిరిపోయి పక్కన ఉన్న చెట్టుకు తగలడంతో, అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు రాజేశ్‌ను వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యానికి మొయినాబాద్‌కు, అక్కడి నుంచి ఉస్మానియాకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ అర్ధరాత్రి రాజేశ్ మృతి చెందాడు. మరోపక్క వినయ్ తీవ్రంగా గాయపడగా, అభిషేక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి తండ్రి వీరయ్య శుక్రవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమిని తేల్చేందుకు సర్వే

వెంచర్‌పై వచ్చిన ఆరోపణలతో రెవెన్యూ అధికారుల చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీ రాజు తదితరులు

కందుకూరు: ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని మండలంలోని పెద్దమ్మతండా వెనకనున్న పులిమామిడి రెవెన్యూలో ఫాంల్యాండ్ వెంచర్ ఏర్పాటు చేశారంటూ వచ్చిన ఆరోపణలపై అధికారులు చర్యలు ఉపక్రమించారు. ఈ మేరకు శుక్రవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీ రాజు పర్యవేక్షణలో రెవెన్యూ అధికారులు సర్వే నంబర్ 77లో ఉండాల్సిన 7.13 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేయించారు. కాగా అటు పులిమామిడి ఇటు మహేశ్వరం మండలం ఆకాన్‌పల్లికి చెందిన రెవెన్యూలోకి ఓవర్ ల్యాపింగ్ వచ్చినట్లుగా గతంలో అధికారులు భావించారు. ప్రస్తుతం చేసిన సర్వేలో ఏమైందనే విషయాన్ని అధికారులు వెల్లడించలేదు. కాగా సర్వే నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ గోదాంపై దాడి

రాజేంద్రనగర్: యాసిడ్, సింథటిక్ రంగులు, వివిధ రసాయనాలతో అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న గోదాంపై సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. దాదాపు రూ.15 లక్షల విలువైన 7.3 టన్నుల అల్లం, వెల్లుల్లి పేస్టును స్వాధీనం చేసుకున్నారు. దీన్ని పరీక్షల కోసం ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. అమీర్ బుద్వేల్ గ్రీన్ సిటీలో అప్నా ఎంటర్‌ప్రైజెస్ పేరిట గోదాంను వెల్లుల్లి తయారులో యాసిడ్, కెమికల్ వాటర్‌ను వాడారు.


బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి శుక్రవారం సన్మానించారు. శాలువా కప్పి, జ్ఞాపిక అందజేశారు. చిత్రంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఉన్నారు. – సాక్షి, రంగారెడ్డి జిల్లా